క్లుప్తంగా

సుబ్బరాజు కుటుంబాన్ని పరామర్శించిన మోషేనురాజు



వెంకట్రామరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మోషేనురాజు

భీమవరం: పితృవియోగంతో బాధపడుతున్న అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజును శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు పరామర్శించారు. మంగళవారం సుబ్బరాజు తండ్రి వెంకట్రామరాజు మృతదేహానికి మోషేనురాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్రామరాజు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు వాసర్ల ముత్యాలరావు తదితరులున్నారు.

వనరుల వినియోగంపై సర్వే

ఆకివీడు: జల వనరుల వినియోగంపై నిర్దిష్టమైన సర్వే చేయాలని డివిజనల్ గణాంక శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వనరుల వినియోగంపై సర్వే, అనంతరం గ్రామంలోని రాళ్ల చెరువు వివరాలను యాప్‌లో నమోదు విషయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని చెరువుల వివరాలు సేకరించాలన్నారు. చేపల చెరువులు, రొయ్యల చెరువులు, మంచినీటి చెరువులతో పాటు పశువుల చెరువులు రజక చెరువుల వివరాలను యాప్‌లో నమోద చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరావు, వీఆర్వోలు మన్నే శ్రీనివాస్, దానయ్య, సుబ్బారావు, రామాంజనేయులు, ఏఎస్ఓ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి రుణాలను సద్వినియోగం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమీషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రర్ అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో మంగళవారం రామచంద్రర్, షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్‌బాబు సంయుక్తంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డ్ కులాలకు అమలు చేస్తున్న సబ్సిడీ బ్యాంకు రుణాలు, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిపై సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి , రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ, ఎస్పీ అద్నాన్ నయూమ్ అస్మి, అడిషనల్ ఎస్పీ వి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరుపాడులో విజిలెన్స్ తనిఖీలు

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న శ్రీవెంకటరమణ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించినట్లు కాళ్ళ మండలం వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు తెలిపారు. ఈ షాపులో ఎరువులు, యూరియా, నిల్వలను తనిఖీ చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. దీనిలో భాగంగా రూ. 25 వేలు విలువైన 500 కిలోల జింకును గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఐ.గోపాలకృష్ణ, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ కె.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులు, ఫించన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి హరికుమార్, వైవీ సత్యనారాయణమూర్తిలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ అమెండ్మెంట్ బిల్లును తక్షణం రద్దు చేయాలన్నారు. కేంద్ర, ప్రభుత్వాలు పే కమీషన్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని, రాష్ట్రప్రభుత్వం సమగ్ర బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, రైల్వే, విమాన సర్వీస్‌ల్లో సీనియర్ సిటిజన్స్‌కు రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో సంఘం గౌరవాధ్యక్షుడు కె నాగేశ్వరరావు, భీమవరం శాఖ అధ్యక్షుడు జి చిన్నయ్య, ఉపాధ్యక్షుడు వి బ్రహ్మానందం, కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉండాలి

ఉండి: ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడమే నిజమైన సేవ అని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆపదలో ఉన్న తాడేపల్లి శ్రీనివాస్ కుటుంబ అత్యవసరానికి రూ.20 వేల ఆర్థిక సహకారాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, పెన్మత్స రంగప్రసాద్‌రాజు, ప్రతినిధులు ద్వారంపూడి నారాయణరెడ్డి, ముదునూరి శివరామరాజు, గొట్టుముక్కల రాము, సత్తి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పుంతల ఆక్రమణలు

- ఆక్వా చెరువులు, మేతల షెడ్‌లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- చిరు వ్యాపారులపై ప్రతాపం, ఆక్వా రైతులపై కనికరం



వాండ్రం పరిధిలో పుంతను ఆక్రమించి షెడ్డు, చెరువుగట్లు వేసుకున్న దృశ్యం



పుంతరోడ్డును ఆక్రమించుకుని చెరువులో కలిపేసుకుంటున్న దృశ్యం

ఉండి: నియోజకవర్గంలో పుంత భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఒకవైపు కొందరు దురాశాపరులు పుంత భూములను తమ పొలాల్లో కలిపేసుకుంటుంటే మరికొందరు వాటిని ఆక్రమించుకుని ఆక్వా చెరువుల్లో కలిపేసుకుంటున్నారు. అంతేకాకుండా పుంత భూముల్లో పర్మినెంట్ షెడ్లు, తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేసుకుని తమ అవసరాలకు వినియోగించుకుంటూ ఆక్రమణల పర్వానికి తెరతీస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ, మండల కేంద్రాలకు దూరంగా వుండే గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఆక్రమణలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పుంత భూములను ఆక్రమించుకున్న రైతులు క్రింది వరి పొలాలు,ఆక్వా చెరువుల వద్దకు వెళ్లే ఇతర రైతులకు ఆటంకాలు కలిగిస్తున్నారు. దీంతో రైతుల మధ్య తగాదాలకు భూ ఆక్రమణలు కారణంగా మారుతున్నాయి. అంతే కాకుండా ఆక్వా చెరువులకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసుకునేందుకు చెరువు గట్లను కాదని పుంత భూములను ఎంచుకుని ఆక్రమణలకు దారి తీస్తున్నారు. విద్యుత్ అధికారులు కూడా ఆక్వారైతు సొంత భూమిలో కాకుండా ప్రభుత్వ భూముల్లోను, కాలువ గట్లు, పంటబోదెలు,డ్రెయిన్‌గట్లపైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి వారి పని ముగించుకుని చేతులు దులుపుకుంటున్నారు. ఇదే అదునుగా కొందరు ఆక్వారైతులు సదరు భూములను ఆక్రమించుకుని ఇవన్నీ తమ వేనన్నట్లు మరెవ్వరినీ ఆ ప్రాంతానికి రానీయకుండా అడ్డుకుంటున్నారు.

నోరు మెదపని రెవెన్యూ అధికారులు

గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఈ ఆక్రమణలపై నోరుమెదపకుండా భాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులే ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. నిరుపేదలు సెంటు భూమిని ఆక్రమించుకుని షెడ్లు వేసుకున్నా, చిరువ్యాపారులు రోడ్ల పక్కన షెడ్లు,పాకలు వేసుకుని వ్యాపారం చేస్తున్నా అధికారులు ప్రతాపం చూపించి వారిని ఆగమేఘాలపై వెళ్లగొట్టేస్తున్నారు. అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా వారి ప్రతాపం, వారి అధికారం జులుం చూపించేది పేదవాళ్లపైన మాత్రమే అని నియోజకవర్గంలో మరోసారి రుజువవుతుంది. ఆక్రమణల తొలగింపు పేరుతో పూరిళ్లు కూడా కూలగొడుతున్న అధికారులు సామాన్యులు,నిరుపేదల నడ్డివిరుస్తున్నారు. ఉండి సెంటర్‌కు ఇరువైపులా చిరు వ్యాపారులను ఖాళీ చేయించి ఎంతో మందిని వీధులపాలు చేయించిన అధికారులు పాత లక్ష్మీ థియేటర్ వద్ద రాష్ట్రీయ రహదారిని ఆక్రమించిన వారిపైనా, ప్రక్కనే ఉన్న పంటబోదెల ఆక్రమించుకున్న బాడాబాబులపైనా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా అటువైపు కన్నెత్తి చూడలేదు. మరీ విచిత్రం ఏంటంటే వాటి ఎదురుగా ఉన్న తాటాకిళ్లను ఖాళీ చేయించి నిరుపేదలను రోడ్డుపాలు చేశారు.

పుంత ఆక్రమణ దారుణం



పుంత భూములు వ్యవసాయాభివృద్ధికి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కోసం ఏర్పాటు చేశారు. ఆక్రమణ దారులు వాటిని ఆక్రమించుకోవడం దారుణం. వాటిని ఆక్రమించుకుని అమ్మకాలు జరిపితే తర్వాత రోజుల్లో రైతులు ఎన్నో ఇబ్బందులు పడతారు.అధికారులు వీటిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి.

– శేషాద్రి శ్రీనివాస్, ఉండి

సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలి



పుంత భూముల ఆక్రమణలు సరికాదు. అధికారులు ఇప్పుడు చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో న్యాయపరంగా పోరాటాలు చేయాలి. మొదట్లోనే అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి పుంత భూములను స్వాధీనం చేసుకుంటే ఇబ్బందులు తప్పుతాయి. లేకుండా ఎవరైనా వాటి జోలికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– దానం విద్యాసాగర్, న్యాయవాది

బీసీ మహిళపై దాడి దారుణం

కాళ్ల: బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి టీడీపీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు ఆరోపించారు. మంగళవారం నియోజకవర్గ బీసీ నాయకులతో పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడిని ఖండించారు. పశ్చిమగోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొండేటి శివ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని ఇలా దాడుల చేయిస్తున్న టీడీపీ ప్రభుత్వానికి బీసీల గుణపాఠం చెప్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ మాట్లాడుతూ బీసీ మహిళని అత్యంత హీనంగా దుర్భాషలాడి, బీసీల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమే కాకుండా, మళ్ళీ ఆమె భర్తపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పాలకోడేరు మండల అధ్యక్షుడు చెల్లబోయిన పాపారావు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీసీలనే హింసిస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి బీసీల పవర్ చూపిస్తామని, గౌడ సంఘాలు బీసీ సంఘాలు కూడా చంద్రబాబుకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సుందర్ కుమార్, ఉండి టౌన్ పార్టీ ప్రెసిడెంట్ కరిమెరక మల్లికార్జున్, యండగండి సర్పంచ్ కృష్ణమూర్తి, నియోజకవర్గ బీసీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్, బీసీ నాయకులు

వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ నియామకం

భీమవరం: భీమవరం పట్టణ వైఎస్సార్ సీపీ నూతన కమిటీని ఎంపిక చేశారు. పదవులు పొందిన నాయకులకు మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు కండువాలు కప్పి అభినందించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా గాదిరాజు రామరాజు, ఉపాధ్యక్షుడిగా మల్లుల శ్రీనివాసరావు, చిగురుపాటి రాజు, ప్రధాన కార్యదర్శులుగా కట్టా నాగవెంకట రవిశంకర్, బాలం వెంకట శ్రీనివాస్, తుంపాల శ్రీను, తాళ్లపూడి పరమేశ్వరరావు ఎంపికయ్యారు. కార్యదర్శులుగా ముదునూరి సుబ్బరాజు, కముజు నర్సింహరావు, పూజారి రంగరాజు, ఓలేటి రాధాకృష్ణ, అబ్దుల్ హై, కార్యవర్గ సభ్యులుగా మేకా మణికంఠ సతీష్ కుమార్, దాసు రాజు, పైపూరి వెంకట సూర్యనారాయణ, మహ్మద్ సాకెత్ బాషా, దుంగా విజయ్‌కుమార్, కర్రి నందం నాయుడు, వాసంశెట్టి శ్రీనివాస్, బొక్కా సత్యనారాయణ, బుద్ధరాజు వెంకట రామకృష్ణ వర్మ, సోమాదుల పైడిరాజు, గుల్లంకి రాజు, కొండేటి సుధాకర్, రొక్కల సుబ్బయ్య, రేలంగి శ్రీనివాసరావు, గంధం సీతారాం, కొలుకులూరి సత్య మోహన్, కోడే శ్రీధర్, షేక్ అజహర్, సరిపల్లి రమేష్, జెట్టి వెంకటేశ్వరరావు, కోసిరెడ్డి రాంబాలాజి, లక్కు త్రిమూర్తులు, కోనాల ఏసేబురాజు, కొమ్ము శ్రీనివాసరావు, నొకట్ల రంగారావు, వంకా ఉదయ్ కుమార్, యజ్ఞిపురపు అప్పల నాయుడు, మునకాల నర్సింహమూర్తి, తోట సాయి సత్య మూర్తి, యండమూరి సతీష్, చింతలపాటి రమేష్‌వర్మ, తిరుమాని రాము, చీరా కృష్ణ గాంధీ, అలబాని రాంబాబు, గొల్లమందల స్టాన్లీ జోన్స్ ఎంపికయ్యారు. వీరిని నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు తదితరులు అభినందించారు.



పట్టణ కమిటీని అభినందిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

ఎస్సీలపై దాడులు పెరిగిపోయాయి

పాలకోడేరు: కూటమి ప్రభుత్వం పాలనలో ఎస్సీలపై దాడులు పెరిగిపోయాయని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కొండేటి లాజరు ఆరోపించారు. ఈ మేరకు భీమవరం వచ్చిన షెడ్యూలు కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సమస్యలను వివరించారు.

అధిక లోడుతో పాడైన ట్రాన్స్‌ఫార్మర్లు

ఆకివీడు: విద్యుత్ వినియోగం అధికమై ఆయా ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో వివిధ విభాగాలు పాడైపోయి సరఫరా నిలిచిపోతుంది. గత వారం రోజులుగా గ్రీష్మ తాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కబోతతో ప్రజలు ఏసీలు అధికంగా వాడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు అదనపు లోడు భారం పడటంతో ఒక్కసారిగా సరఫరా నిలిచిపోతుంది. గత రెండు రోజుల్లో స్థానిక పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదారు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి మరమ్మతులు చేపట్టడం, పాతవాటి స్థానంలో మరొక ట్రాన్స్‌ఫార్మర్ వేయడం వంటి చర్యలతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎండవేడిమితో ప్రజలు అల్లాడిపోతుంటే వారంలో రెండు రోజులు ట్రీ కటింగ్ అని, ఇతర కారణలతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కరెంట్ కోత లేకపోయినా, ఈ విధమైన చర్యలతో కరెంట్ సరఫరా నిలిచిపోతుందని వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోతే ఒక పూట వరకూ కరెంట్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. స్థానిక సబ్ స్టేషన్‌లో సిబ్బంది కొరతతో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శాంతినగర్‌లో పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మెగా జాబ్‌మేళా

వీరవాసరం: మండలంలో నవుడూరు కేఎస్ఎన్ఆర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 300 మంది ద్యార్థులు పాల్గొన్నారని, వారిలో 200 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.ప్రసాద్ రెడ్డి తెలిపారు. వికాస ఆధ్వర్యంలో హైదరాబాద్, వైజాగ్, బెంగుళూరు, చెన్నై, నెల్లూరు, అనంతపురం, పూణే నగరాలలో గల వివిధ ప్రముఖ కంపెనీలలో జాబులకు సంబంధించి విద్యార్థులు సెలెక్ట్ అయినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అందరికీ ఆఫర్ లెటర్స్ కూడా ఆయా కంపెనీలు అందజేయడం జరిగిందన్నారు. జాబ్ మేళాకు సహకరించిన వికాస్ టీం సభ్యులకు కెఎస్ఎన్ఆర్ కళాశాల అధ్యాపకులు కృతజ్ఞతలు తెలియజేశారు. జాబ్ మేళాకు ఎంపికైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

దాతల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వంపాటు దాతలు ముందుకు రావడం అభినందనీయమని భీమవరం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాయి(జెఎల్‌బీ) మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం జెఎల్‌బీ మునిసిపల్ హైస్కూల్లోని 150 మంది విద్యార్థులకు దాతల సహకారంతో స్టీల్ కంచాలు, గ్లాసులను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని భోగలింగేశ్వర స్వామి దేవస్థానం అర్చకుడు పుసలూరి కృష్ణమూర్తి (మంగేష్) ఆర్థిక సహకారంతో విద్యార్థులకు స్టీల్ కంచాలు, గ్లాసులు సమకూర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజా, సుచిత్ర, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బి బలరామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భీమవరం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్స్ వల్ల ప్రజలపై మోయలేని బారం పడుతుందని, ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు పేరుతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతుంటే మళ్లీ స్మార్ట్ మీటర్ల కారణంగా మరిన్ని ఇబ్బందులు తప్పవన్నారు. ఏఐటియూసీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, పార్వర్డ్‌బ్లాక్ నాయకుడు దండుశ్రీనివాసరాజు మాట్లాడుతూ ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై బారాలు వేయాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎం ఆంజనేయులు, ఎం వైకుంఠరావు, కె క్రాంతిబాబు, ఎం రామాంజనేయులు, డి త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

ఎరువుల వినియోగంపై అవగాహన

కాళ్ల: సాగులో పచ్చిరొట్ట ఎరువులు, కంపోస్టు వినియోగించడం వల్ల 15 నుంచి 20 శాతం వరకు ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని కాళ్ల వ్యవసాయ అధికారి బి.రమేష్ నాయుడు తెలిపారు. కాళ్ల మండలం కోపల్లే గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సార్వా నాట్లు వేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సార్వా సాగులో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా పచ్చిరొట్ట, జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి వాటి ఉపయోగాల గురించి వివరించారు. అధిక నత్రజని వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జింకు, జిప్సం, పిల్లి పెసర, టార్పాలిన్‌లను సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరినట్లు ఆయన తెలిపారు.

మధ్యవర్తిత్వంలో ఇరు పార్టీలదీ విజయమే

భీమవరం: మధ్యవర్తిత్వంలో ఇరుపార్టీలకు ఆమోదయోగ్యంగా రాజీ చేసే అవకాశమున్నందున కక్షిదారులు ఇరుపార్టీలు విజయం సాధించినట్లేనని అందువల్ల మధ్యవర్తిత్వం యొక్క ప్రయోజనాలను కక్షిదారులకు తెలియజేయాలని భీమవరం ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి హనీష తెలిపారు. మంగళవారం మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జడ్జి హనీష అధ్యక్షతన జరిగిన మీడియేషన్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కక్షిదారులకు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మీడియేషన్ న్యాయవాదులు హరి, స్టీఫెన్ బాబు, విజయలక్ష్మి, ప్యానల్ న్యాయవాదులు సుధీర్, సురేష్ కుమార్, జ్యోతి, అంబేద్కర్, రవికిరణ్, భవాని, లోకేష్, పారా లీగల్ వలంటీర్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదులు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి హనీష

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

పాలకోడేరు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటపల్లి మంగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కుముదవల్లిలో మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చీకటిపల్లి మంగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మాలలను ఓట్లకే పరిమితం చేసి ఓట్లు అయిన తర్వాత వారికి అన్యాయం చేయటం చాలా దారుణమన్నారు. త్వరలో కూటమి ప్రభుత్వానికి మాలల సత్తా చూపిస్తామన్నారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ దళితులపై దాడులు పెచ్చుమీరాయని వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కొండేటి లాజర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కోరం ముసలయ్య, కటికదల రాజారావు,గండి నాని, కురు కుంటి పోలు, కలిగితి రత్నరాజు, మతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను యువతే రూపుమాపాలి

ఆకివీడు:మాదక ద్రవ్యాల సమస్య నేడు సమాజాన్ని పట్టి పీడిస్తుందని ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల నిరోధంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువ శక్తి నిర్వీర్యమైపోతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఆపరేషన్ పరివర్తన్ పేరుతో అవగాహన కల్పించేందుకు యడవల్లి బ్రదర్స్ కళాజాత బృందం బుర్రకథ రూపంలో వివరించారు. కార్యక్రమంలో ఎస్సై హనుమంతు నాగరాజు, కళాశాల మాదకద్రవ్యాల నిరోధక సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ టీ.ఓగేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: మత్తు పదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఆకివీడు సీఐ జగదీశ్వరరావు సూచించారు. మండలంలోని పెద అమిరంలోని అబ్యాస్ స్కూల్లో మంగళవారం పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి

ఆకివీడు: స్థానిక శ్రీరాంపురం ఈ నెల 9న రాత్రి పాత కక్షల నేపథ్యంలో జరిగిన దాడిలో అదే ప్రాంతానికి చెందిన గొర్రెల నాగేశ్వరరావు గాయపడ్డాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. అదే ప్రాంతానికి చెందిన జోగడ నాగరాజుకు నాగేశ్వరరావుకు పాతగొడవలున్నాయన్నారు. నాగరాజు కర్రలతో దాడి చేయడంతో కళ్లపై భాగంలో తీవ్ర గాయాలయ్యాని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.